క్లుప్తంగా

ఆలయ అర్చకులకు పంచాంగాలు పంపిణీ



పామర్రు: ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో ఆలయాల్లోని అర్చకులకు విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ తిథి, వార, నక్షత్ర, యోగ కరణాలను తెలియజేసే పంచాంగాలు పండితులకు ఇవ్వడం వలన పలువురికి మంచి చెప్పే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయం, విష్ణాలయం, అంకమ్మతల్లి దేవాలయం, కన్యకా పరమేశ్వరీఅమ్మవారి ఆలయం, బుచ్చమ్మ తల్లి ఆశ్రమాల్లోని అర్చకులకు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆర్.ప్రసాద్, ఆర్.భార్గవ, ఎల్ భీష్మ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



గుడివాడరూరల్: వర్ధమాన్ మహావీర్ జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి మానవత్వాన్ని చాటిన జ్ఞానచంద్‌కు ధన్యవాదాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ (ఆర్‌కె) అన్నారు. స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలోని పేదలకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ మహావీర్ జయంతి సందర్భంగా జ్ఞానచంద్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు రూప్‌చంద్, హారిక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



గుడివాడ టౌన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు గురువారం ధర్నా చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ కార్యదర్శి ఎన్. మదన్ మోహన్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు మేలు చేకూర్చే 1/219 సర్క్యులర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలతో పాటు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ ఉపాధ్యక్షుడు జీఎస్ రావు, గ్యారేజి కార్యదర్శి సురేష్, యూనియన్ నాయకులు ఎల్ఆర్ బాబు, రామారావు, సుబ్బారావు, మోషే, శ్రీను, రవి, రాజు, సోములు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయం



పామర్రు: క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని ఉరుటూరురోడ్డులో నిర్వహించిన క్రీస్తు సువార్త సభలలో ఎమ్మెల్యే గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షమ, దయ, శాంతి గుణాలు కలిగి ఉండాలని తెలిపారు. తన వలే తన తోటి వారిని గౌరవించాలని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాటూరి శ్రీనివాసరావు, బి. హరికిరణ్, ఎబినైజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట పైర్ల సాగు ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అవసరమని అది ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు నాగవాణి, రమేష్, రామారావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో యథేచ్ఛగా ఆక్రమణలు

- ఆక్రమణదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- రోడ్డుపై ప్రయాణాలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



రోడ్డును ఆక్రమించి కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణాలు



మున్సిపల్ కార్యాలయాన్ని అనుకుని అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు

గుడివాడరూరల్: గుడివాడ పురపాలక సంఘానికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురైంది. రోడ్డుకి ఇరువైపులా ఎక్కడ చూసినా వ్యాపారాల పేరిట రోడ్డును అక్రమించడంతో ప్రయాణాలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి నేతలే ఆక్రమణలు ప్రోత్సహించి వ్యాపారుల నుంచి రోజువారీ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమణలు తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో అక్రమణలు తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు సొంత కార్యాలయం ముందే రోడ్డును అక్రమిస్తే తొలగించలేకపోతున్నారు. అధికారంలోకి రాగానే కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు కూరగాయల షాపును డ్రైనేజీ ప్రక్షాళన పేరుతో అడ్డగోలుగా తొలగించారు. అదే ప్రాంతంలో ఉన్న మరికొన్ని షాపులను తొలగించారు. పట్టుమని నెలరోజులు కాకముందే అదే ప్రాంతంలో మరొక కూరగాయల షాపుతో పాటు వ్యాపార సముదాయాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. అది చాలదన్నట్లు పురపాలక సంఘ కార్యాలయాన్ని అనుకునే మరికొన్ని షాపులు ఏర్పాటు చేశారు.

అడ్డగోలుగా షాపులు ఏర్పాటు....

పట్టణంలో అక్రమణలు తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు సొంత కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డే అక్రమణలకు గురయినా చోద్యం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నానా రభస చేసి షాపులు తొలగించిన అధికారులు పట్టుమని మూడువారాలు కాకుండానే కార్యాలయం ఎదుట అడ్డగోలుగా షాపులు ఏర్పాటు చేసి రోడ్లను అక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నేతల ఒత్తిళ్లతోనే మున్సిపల్ అధికారులు అక్రమణలు తొలగించకుండా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకుని కూటమి నేతల దందాలకు అడ్డుకట్ట వేసి కార్యాలయ రోడ్డు అక్రమణలు తొలగించాలని పురపాలక ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా అక్రమణల గురించి తన దృష్టికి రాలేదని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కూటమి నాయకుల దందా...

పురపాలక సంఘ కార్యాలయం రోడ్డును ఇరువైపులా అక్రమణల వెనుక కొంతమంది కూటమి నాయకుల హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వ్యాపారాన్ని బట్టి రేటు నిర్ణయించి షాపులను ఏర్పాటు చేసేందుకు కొంతమంది నేతలు అక్రమణలు రావడానికి కారణంగా తెలుస్తుంది. ముందుగా నెలవారీ వసూళ్ల పేరిట దుకాణాలు ఏర్పాటు చేయించిన కూటమి నాయకులు ప్లేటు ఫిరాయించి ప్రతిరోజు వసూళ్లకు దిగడంతో చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునే వ్యాపారాలు లబోదిబోమంటున్నారు. మామూళ్లు ఇస్తేనే దుకాణాలు పెట్టుకోండి లేకపోతే తీసేయండి అంటూ కూటమి నాయకులు హుకుం జారీ చేయడంలో వ్యాపారులు గగ్గోలు చెందుతున్నారు. భారీగా డబ్బులు ఇచ్చే వ్యాపారాలను ప్రోత్సహించి చిన్నచితకా వ్యాపారాలు చేసేవారిని ఖాళీ చేసేయమని చెప్పడంతో వ్యాపారస్తులు నిట్టూరుస్తున్నారు.

గుడ్లవల్లేరు పాఠశాలను విలీనం చేయొద్దు



తల్లిదండ్రులు అందించిన వినతిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ పాఠశాల – 1లో దశాబ్దాలుగా అన్ని తరగతులు నడుస్తుండగా...కొన్ని తరగతులను తగ్గించి విలీనం చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ పాఠశాల పేరెంట్స్ కమిటీకి చెందిన తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. అనాదిగా తమ పాఠశాలలో 3, 4, 5వ తరగతులను నడుస్తుండగా ప్రభుత్వ కొత్త నిర్ణయంతో ఆ తరగతుల విద్యార్థులను గుడ్లవల్లేరు మండల పరిషత్ పాఠశాల – 2లో విలీనం చేస్తామన్న కుదించే ప్రక్రియను తమ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. పాత పద్ధతిలోనే అదే 3, 4, 5వ తరగతులను నిర్వహించాలని కోరారు. డీఈఓ రామారావు, గుడివాడ ఆర్డీఓ బాల సుబ్రమణ్యం, ఎంపీడీవో టి.విజయసారథి, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విజయఫ్లోరెన్స్

గుడివాడరూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ అధికారి ఎ.విజయఫ్లోరెన్స్ అన్నారు. స్థానిక 12వ వార్డు ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించడం మొదటి టీకా అని తెలిపారు. బిడ్డకు 6నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అంగన్‌వాడీల ద్వారా అందించే బాలామృతం పెట్టాలన్నారు. సూపర్‌వైజర్ బీకేడీ భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.గీత, ఎం.స్వప్న, ఎంఎస్‌కె, ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక పెద ఎరుకపాడులోని ప్రైమరీ పాఠశాల వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ వారోత్సవాల్లో సీడీపీవో విజయఫ్లోరెన్స్ పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయంతి, ఎంఎస్‌కె రాఘవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీళరాణి, నవ్య, ఎం.లలితమణి, ఎఎన్ఎం భవానీ పాల్గొన్నారు.

పోషకాహారంతో లోపాలు నివారణ



పామర్రులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రాణి



చేవూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుందరమ్మ

పామర్రు: పోషకాహారంతో చిన్నారుల్లో లోపాలు నివారించవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషన్ పక్వాడా అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీడీ పాల్గొని మాట్లాడారు. నాలుగు అంశాలపై ఈనెల 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళ గర్భస్థ దశ నుంచి పుట్టిన బిడ్డకు రెండు ఏళ్ల వరకు మొదటి 1000 రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించటం గురించి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయటం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలు నివారించవచ్చన్నారు. చిన్నారుల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్య కరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా అవగాహన కల్పించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు వారి తల్లులకు ఇస్తున్న పోషకాహారాన్ని అందరూ తీసుకుని తగు విధమైన లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో కె.జ్యోతి, ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ, సూపర్‌వైజర్లు నవ్యశ్రీ, విజయకుమారి, మండల పరిషత్ కార్యాలయం ఈవోపీఆర్డీ సురేష్, పామర్రు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ నిర్వహకులు, సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ముదినేపల్లి రూరల్: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాసి సుందరమ్మ అన్నారు. మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు చేవూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.భాగ్యలక్ష్మీ, టి.భాగ్యలక్ష్మీ, పి.భవాని తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని, చిత్రంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు

కైకలూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కలిదిండి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం వైఎస్సార్ సీపీ ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టు (నరేగా) నిధులు రూ.32 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనకదుర్గారాణి, కట్టా నాగలక్ష్మీ, ఎంపీడీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా రీసర్వే చేయండి



రీసర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

పాములపాడు(పెదపారుపూడి): ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను సజావుగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలజీ అధికారులను ఆదేశించారు. మండలంలోని పాములపాడు గ్రామంలో రీసర్వేకి సంబంధించిన రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పరిధిలో ఇప్పటి వరకు పూర్తి చేసిన రీసర్వే ప్రక్రియ, తలెత్తిన సమస్యలపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో ఆక్వా సాగు అధికమని, వ్యక్తిగతంగా కాకుండా ఒకే చేపల చెరువు కింద ఎక్కువ మంది రైతులకు చెందిన భూములుండే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి సరిహద్దులు తెలిన వాటికి సబ్ డివిజన్ చేసి ఎల్‌పీఎం సంఖ్య కేటాయింపు జరగాలని సూచించారు. ఉమ్మడి భూములకు జాయింట్ ఎల్‌పిఎం కేటాయించటం ద్వారా భవిష్యత్‌లో ఆయా రైతులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఆ విషయంలో సమస్యను పరిష్కరించాటానికి రైతులు సహకరించాలని కోరారు. రీసర్వే ముందు ఆయా భూముల రైతులకు తప్పని సరిగా తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మండల తహసీల్దార్ వై. రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాల ఆదేశాలపై ఉపాధ్యాయుల ఆగ్రహం

ముదినేపల్లి రూరల్: పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించి రీ–కన్‌స్ట్రక్షన్ తీర్మానాలు సత్వరమే పంపాలంటూ అధికారులు జారీ చేసిన ఆదేశాలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేసి సమీప హైస్కూల్స్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి రీ–కన్‌స్ట్రక్షన్ తీర్మానాలు పంపాలంటూ అధికారుల నుంచి గురువారం ఉదయం ఆదేశాలు అందాయి. పాఠశాలలు విలీనమయ్యే గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, కార్యదర్శి చేసిన తీర్మానాలను గురువారం మధ్యాహ్నానికి పంపాలంటూ ఆదేశాలు జారీ చేసినట్లు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. అనేకమంది సర్పంచులు, కార్యదర్శులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీర్మానాలు రాబట్టలేకపోయారు. సకాలంలో తీర్మానాలు పంపకుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్న తరుణంలో పాఠశాలల పనివేళలు ముగిసిన తరువాత మరోసారి ఆదేశాలు వచ్చాయి. సర్పంచ్, కార్యదర్శులతో పనిలేకుండా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల తీర్మానాలే సరిపోతాయని వీటిని అత్యవసరంగా గురువారం సాయంత్రం లోపే పంపాలంటూ ఆదేశాలు జారీ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. క్షణాల వ్యవధిలో ఇలాంటి ఆదేశాలు జారీ చేస్తే ఏవిధంగా అమలు చేయగలమని ప్రధానోపాధ్యాయులు మండిపడుతున్నారు. కనీసం రెండు రోజులైనా సమయం ఇవ్వకుండా అప్పటికప్పుడే తీర్మానాలు పంపాలంటే ఏవిధంగా సాధ్యపడుతుందని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది ప్రధానోపాధ్యాయులు సకాలంలో తీర్మానాలు పంపినప్పటికీ మరికొంత మందికి అవకాశం లేక శుక్రవారం పంపే ప్రయత్నాల్లో ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



శ్రీహరిపురంలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ముదినేపల్లి రూరల్: వేసవిలో ఉపాధి కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు అన్నారు. గ్రామంలో పంట బోదెల తవ్వకం పనులను సర్పంచ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేందుకు పంచాయతీ తరపున కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్వా రంగాన్ని ఆదుకుంటాం

కైకలూరు/మండవల్లి: సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బీదా మస్తాన్‌రావు, కై కలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చెప్పారు. ప్రస్తుత ఆక్వా పరిస్థితిపై నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశం లోకుమూడి గరువు బీఏ స్సార్ ఆక్వా ట్రేడర్స్ వద్ద గురువారం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికా సుంకాల వల్ల ఏర్పడిన సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు మాట్లాడుతూ కమిటీలో మన ప్రాంతానికి చెందిన వ్యక్తులు సభ్యులుగా లేరని చెప్పగా.. సీఎంతో చర్చించి అవకాశం కల్పిస్తామన్నారు.

పీఎంశ్రీ పనుల పరిశీలన

కైకలూరు: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో పనులను మార్గదర్శకాల అనుగుణంగా అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ఏలూరు జిల్లా సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ కురేళ్ళ పంకజ్‌కుమార్ అన్నారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న రసాయన ప్రయోగశాల, ఆటస్థల నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో పాఠశాల తెరిచే సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రెవెన్యూ సేవలకు రుసుములు

గుడివాడ టౌన్: రెవెన్యూ శాఖ నుంచి ప్రజలకు అందించే సేవలకు రుసుములు నిర్ణయించినట్లు ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు తెలియచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాస్ పుస్తకాలు, మ్యూటేషన్‌కు రూ. 150, భూమి కొలతలు, ఆన్‌లైన్ దరఖాస్తుకు రూ. 550 మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు. నిర్దేశించిన చార్జీలు కంటే అధికంగా వసూలు చేస్తే తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి రెవెన్యూ సేవలు పొందాలని కోరారు.

అధిక ఫీజులు చెల్లించ వద్దు

మొవ్వ: మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ధ్రువ పత్రాలకు అధిక ఫీజులు వసూలు చేయవద్దని తహసీల్దార్ కే మస్తాన్ సూచించారు. అధిక ఫీజులు వసూలు చేస్తే వారి పై శాఖా పరమైన చర్యలు తప్పవని, ప్రభుత్వం నిర్ణయించిన రుసుముని మాత్రమే ధరఖాస్తుదారులు చెల్లించాలన్నారు. అధికంగా వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

నందివాడ: కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములతో వివిధ రకాల రెవెన్యూ సేవలను పొందవచ్చని తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. పాసు పుస్తకములకు రూ.150, భూమి కొలతకు రూ.550 చెల్లించాలన్నారు. మీ–సేవ సెంటర్లలో లేదా గ్రామ/వార్డు సచివాలయాల్లో పైన పేర్కొన్న చార్జీలకు మించి అధిక రుసుములు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా అన్నసమారాధనలు

మండవల్లి: మండంలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం బాబా వారికి ప్రత్యేక పూజలు, అన్న సమారాధనలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ఉన్న స్థానిక బాబా ఆలయం, భైరవపట్నంలోని షిర్డీ సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు, అన్న సమారాధనలు నిర్వహించారు. మండవల్లిలో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బందారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ, భైరవపట్నంలో బాబా భక్తులు పాల్గొన్నారు. చింతపాడులోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా గురువారం అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నూతన ప్రార్థనా మందిరం ప్రారంభం



గుడివాడ టౌన్: స్థానిక ఇందిరా నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మౌంట్ ఆలివ్ ప్రార్థనా మందిరాన్ని గురువారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు మందిరాన్ని ప్రారంభిస్తూ ఏసుక్రీస్తు మనుష్యులకు ఇచ్చిన ప్రేమ, జాలి, దయ, మానవత్వం అనుసరిస్తూ ఈ ప్రార్థనా మందిరంలోని విశ్వాసులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. సమాజ శాంతికి మీ ప్రార్థనలు ఉపయోగపడాలని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ యాక్టివ్ సెక్రటరి కె. గణపతి, పాస్టర్ ఎస్. జాన్‌బాబు పాల్గొన్నారు.

14న అయ్యప్ప ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్టోత్సవం

గుడ్లవల్లేరు: మండలంలోని పెసరమిల్లిలో నిర్మించిన అయ్యప్ప స్వామివారి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్టోత్సవం ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు మామిడికోళ్ల సర్పంచ్ వర్రే విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ ప్రతిష్టోత్సవాన్ని శ్రీ వాసుదేవానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు వర్రే గంగాధరరావు, బలరామకృష్ణ చెప్పారు.

15న ఆలయ భూములకు కౌలు వేలం

పామర్రు: దేవాలయాల భూములకు ఈ నెల 15వ తేదీన కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు పామర్రు గ్రూపు దేవాలయాల మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంకు చెందిన సర్వే నం. 111లో ఉన్న 5–93 ఎకరాల భూమికి కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. అలానే కాపవరం, అడ్డాడ, కనుమూరు, గ్రామాల్లోని దేవాదాయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేవు అభివృద్ధి పనుల పరిశీలన

మండవల్లి: స్థానిక ఎస్సీ ఏరియాలో వాడుక రేవు అభివృద్ధి పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్లాస్టింగ్ పనులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, మెండా యాకోబు, చిగురుపాటి కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చావలిపాడులో శిలువయాత్ర



మండవల్లి: మండలంలోని చావలిపాడులో గురువారం రెవరెండ్ ఫాదర్ శాంతిరాజు, రెవరెండ్ ఫాద్ ప్రదీప్, సంఘ కాపరి వర్రె దయానంద్ ఆధ్వర్యంలో శిలువయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెగా అలంకరించారు. వేద పండితులు స్వామి వార్ల కల్యాణం వేద మంత్రాలతో కమనీయంగా జరిపించారు. ముఖ్యంగా స్వామి వారు, అమ్మవార్ల ఎదురుబొదురు ఉరేగింపు భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొర్నిపాడు, జమిదింటకుర్రు, వెంట్రప్రగడ, జువ్వనపూడి, తదితర గ్రామాల నుంచి స్వామి వార్ల కల్యాణం తిలకించేందుకు వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారి సంబరాలు

గుడ్లవల్లేరు: మండలంలోని మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారి సంబరాలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అమ్మవారి సంబరాల్లో ప్రభలను కట్టి మొక్కుబడులను తీర్చుకునే కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యం ఏర్పడనుందని చెప్పారు. సంబరాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.